

మళ్లీ సెప్టెంబరులో ముహూర్తాల్లేవ్..

ఆదివారం నుంచి శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పెళ్లిళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. సెప్టెంబరు నెలలో భాద్రపద మాసంలో మాత్రం ముహూర్తాలు లేవు. తిరిగి ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర మాసాల్లో అంటే అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ముహూర్తాలు ఉన్నాయి.. తల్లిదండ్రులు కంగారుపడకుండా పెళ్లిళ్లు చేసుకోవచ్చు. ఒక నెలలో మాత్రమే ముహూర్తాల్లేవ్..

- కారుపర్తి నాగమల్లేశ్వర సిద్ధాంతి, శుభతిథి గంటల పంచాంగకర్త, పుల్లేటికుర్రు

పెళ్లి కళ వచ్చేసిందే బాలా..

ఈ నెల 7 నుంచే మోగనుంది కల్యాణవీణ

- 7 నుంచే ఆరంభం
- 12 రోజులు మంచి ముహూర్తాలు
- మూడు నెలల తర్వాత శుభఘడియలు
- ఏర్పాట్లలో తల్లిదండ్రులు





కాకినాడ (ఆంధ్రజ్యోతి)/అన్నవరం/మండపేట : మోగనుంది పెళ్లి బాజా. మూఢం.. శూన్యమాసం.. కారణంగా మార్చి నెల నుంచి ముహూర్తాలు లేవు.. అందరూ మంచిరోజులకు ఎదురుచూస్తున్నారు. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు భారీగా ఉండడంతో పెళ్లి సందడి నెలకొంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మళ్లీ పెళ్లి బాజాలు భారీగా మోగ నున్నాయి. భారీ ఎత్తున పెళ్లిళ్లు చేయడానికి వధూవరుల కుటుంబాలు ఉరుకులు, పరుగులు పెడుతున్నాయి. నగలు, వస్త్రాలు, కల్యాణ మండపాలు, సన్నాయి, కేటరింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంలో నగలు, వస్త్ర దుకాణాల్లో అప్పుడే షాపింగ్ కళ పెరిగిపోయింది. బంగారం ధర కాస్త తగ్గడంతో ఇదే మంచి సమయంగా కోట్లలో కొనుగోళ్లు జరుగుతున్నాయి.

మరో రెండు రోజుల్లోనే శ్రావణం..

ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. ఈ నెల 7 నుంచి భారీగా వివాహ ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో మొత్తం 14 రోజులు వివాహాలకు శుభ ఘడియలుగా పండితులు చెబుతున్నారు. దీంతో ఎక్కడికక్కడ పెద్దఎత్తున ముహూర్తాలు ఖరారయ్యాయి. ముఖ్యంగా ఈనెల 18, 22, 23 తేదీల్లో అయితే ఉమ్మడి జిల్లాలో వేలల్లో పెళ్లిళ్లు ఉన్నాయి. మూడు జిల్లాల్లో కలిపి దాదాపు 26 వేలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో ఆభరణాలు, వస్త్రాలు, డెకరేషన్, మండపాలు, సన్నాయి, కేటరింగ్ కలిపి మొత్తం రూ.520 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు జరగవచ్చని వర్తక సంఘాలు విశ్లేషిస్తున్నాయి.

మంచి ముహూర్తాలు ఇవే..

ప్రధానంగా ఈ నెలలో 7, 8, 9, 10, 13, 15, 17, 18, 19, 22, 23, 24 తేదీలు వివాహాలకు అత్యంత అనుకూలమని పంచాంగకర్తలు ప్రకటించారు. వీటిలో అత్యంత బలమైన ముహూర్తాలుగా 17, 18, 22, 23 తేదీలను పేర్కొన్నారు. దీంతో ఆయా తేదీల్లో కల్యాణ మండపాలకు యమ డిమాండ్ ఏర్పడింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కల్యాణ మండపం దొరకడం గగనమైపోతోంది. అసలు వర్షాకాలం కావడంతో కల్యాణ మండపం తప్పనిసరిగా మారింది. ఇక కొంత మంది తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లల వివాహాలు దైవ సన్నిధిలో చేసుకుంటే వారి వైవాహిక జీవితం కష్టాలు లేకుండా సాగుతుందని భావిస్తుంటారు. ఆనవాయితీగా కూడా అలా చేస్తారు. రాష్ట్రంలో తిరుపతి తర్వాత అన్నవరం, ద్వారకాతిరుమలలో అధిక సంఖ్యలో వివాహాలు జరుగుతంటాయి. అన్నవరంలో ఏడాదికి 8 నుంచి 10 వేల జంటలు సత్యదేవుడి సాక్షిగా ఒక్కటవుతుంటాయి. శ్రావణమాసం నేపథ్యంలో సత్యదేవుడి సన్నిధిలో వివాహ మండపాలన్నీ బుకింగ్ జరిగిపోయాయి. బలమైన ముహూర్తాలున్న నాలుగు రోజుల్లో అయితే కొండపై వెయ్యికిపైగా వివాహాలు జరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్నవరం కొండపై సత్రం గదులకు సైతం భారీ డిమాండ్ నెలకొంది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు భారీగా రావడంతో గదుల కేటాయింపుపై ఏంచేయాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఖర్చు రూ.కోట్లలో..

కాకినాడ జిల్లావ్యాప్తంగా పల్లెలు, పట్టణాలన్నీ కలిపి 10 వేలకు పైగా వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం జిల్లా 7 వేలు, కోనసీమ జిల్లావ్యాప్తంగా 9 వేలకుపైగా పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. సరాసరి ఒక్కో వివాహానికి కనీసం రెండు లక్షలు ఖర్చు చేసినా రూ.520 కోట్ల వరకు వ్యాపార లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడునెలలుగా గిరాకీ లేని పూల డెకరేషన్, బంగారం దుకాణాలు, క్యాటరింగ్, పురోహితులు, సన్నాయి, ఈవెంట్ ఆర్గనైజింగ్ తదితర రంగాల వ్యాపారం భారీగా పుంజుకోనుంది. ఇప్పటికే ఏ బంగారం దుకాణం చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఆభరణాల కొనుగోళ్లే రూ.150 కోట్లు దాటిపోతాయని అంచనా. పురోహితులు, మంగళ వాయిద్యకారులకు విపరీతమైన డిమాండ్ నెలకొంది.

సందడే సందడి..

పెళ్లి అనే రెండక్షరాల బంధం ప్రతి ఒక్కరి జీవితంలో అత్యంత కీలకమైంది. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం ఆచితూచి శుభఘడియలను ఎంచుకుని ముడేస్తారు. తద్వారా వారి వివాహ బంధం జీవితకాలం ఎలాంటి ఆటుపోట్లకు లోనవకుండా ఉండాలని కోరుకుంటుంటారు. ఈ వివాహాలకు ఏప్రిల్ తర్వాత మూడు నెలల విరామం వచ్చింది. రెండు నెలల మూఢం, మరో నెల శూన్య మాసం రావడంతో మంచి ముహూర్తాలే లేవు. దీంతో వివాహాలన్నీ వాయిదా పడ్డాయి. ఇప్పుడు శ్రావణమాసం ప్రారంభం అవు తుండడంతో మూడు నెలల తర్వాత తిరిగి పెళ్లి కళ వచ్చేసింది. వివాహాలకు శ్రావణం శుభకరమని పండితులు చెబుతారు. ఈనెల 5 నుంచి శ్రావణమాసం ప్రారంభం కాగా 7 నుంచి వివాహ ముహూర్తాలు ప్రారంభం అవుతున్నాయి. దీంతో వేలాది మంది పెళ్లి ముహూర్తాలు ఖరారు చేసుకుంటున్నారు. వచ్చేవి మంచిరోజులు కావడంతో గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు వంటి శుభకార్యాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసుకుంటు న్నారు. ఈనెల తప్పితే మళ్లీ భాద్రపదం శూన్యమాసం కావడం సెప్టెంబరులో వివాహ ముహూర్తాలు లేవు. ఈనెల శ్రావణం శుభకరంగా భావించి పెద్ద ఎత్తున వివాహాలకు నవ జంటలు సిద్ధమవుతున్నాయి.



శాకాంబరి అవతారంలో ఉన్న అమ్మవారికి సమర్పించిన 101 రకాల పిండి వంటకాలు, చీరలు

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి..
సారె, చీర అందజేత



అమ్మవారికి సారె, చీరలను ఆలయానికి తీసుకువస్తున్న దృశ్యం

సామర్లకోట, ఆగస్టు 2: సామర్లకోట భీమేశ్వరాలయంలో బాలా త్రిపుర సుందరి అమ్మవారికి భక్తుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన సారె, చీరల అందజేత సంప్రదాయ కార్యక్రమాన్ని శుక్రవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆషాఢమాస పర్వదినాలను పురస్కరించుకుని ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ హాజరయ్యారు. ముందుగా మాండవ్య నారాయణస్వామి ఆలయంవద్ద చీర, సారెల పిండి వంటకాలకు ఆలయ పండితులతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మహిళా భక్త మండలి ప్రతినిధుల కోలాటనృత్యాలు, ఆధ్యాత్మిక గీతాలతో భీమేశ్వరాలయం వరకూ ఊరేగింపు నిర్వహించారు. ఆలయంవద్ద ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు తదితరులతో సాదరంగా స్వాగతం పలికి ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. ముందుగా భీమేశ్వరస్వామిని దర్శించి అనంతరం బాలాత్రిపురసుందరి అమ్మవారికి వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి నివేదించారు. పూజల అనంతరం నంది మండపం వద్ద ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్‌కు వేదపండితులు వేదస్వస్తి పలకగా ఈవో నీలకంఠం ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిలో కందిపప్పు రూ.150

- ప్రత్యేక కౌంటర్లలో తగ్గిన ధరలు
- జిల్లావ్యాప్తంగా బియ్యానికి 29 కౌంటర్లు
- కందిపప్పు విక్రయానికి 37 కౌంటర్లు



కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 2: ప్రజలకు తక్కువ ధరలకే బియ్యం, కందిపప్పు అందించాలని ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో వీటి ధరలను తగ్గించారు. కిలో కందిపప్పు రూ.150, స్టీమ్ బియ్యం కిలో 48, రా రైస్ కిలో రూ.47కి అందిస్తున్నారు. ప్రజలకు తక్కువ ధరలకు వీటిని అందించాలనే సంకల్పంతో రాష్ట్రపౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్నారు. జిల్లాలో బియ్యం 29 కౌంటర్ల ద్వారా, కందిపప్పు 37 ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నారు. కాకినాడ నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్‌ల్లో ఉన్న రైతుబజార్లలో ఇవి అందుబాటులో ఉన్నాయి. కాకినాడలో తూరంగి, గొడారిగుంటల్లో ఉన్న డీమార్ట్‌ల్లో, సీఅండ్ సీ సినిమా థియేటర్‌వద్ద ఉన్న రిలయన్స్ ఫ్రెష్‌మార్ట్‌లో లభిస్తున్నాయి. పిఠాపురంలో పార్క్‌సెంటర్‌లో ఉన్న శ్రీ సిద్ధి వినాయక వైష్ణవి జనరల్‌స్టోర్స్‌లో, కోటగుమ్మంలో మహాలక్ష్మీ వాసవీ దుర్గాట్రేడర్స్‌లో, పెద్దాపురంలో శ్రీలలితా ఇండస్ట్రీస్‌లో దొరుకుతున్నాయి. కాకినాడలో దిగుమర్తివారివీధిలో, పాత పోస్టాఫీసువీధిలో కూడా విక్రయిస్తున్నారు. కత్తిపూడి, తుని, గొల్లప్రోలుల్లో కూడా కౌంటర్లు ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- జైలు శిక్ష, భారీ జరిమానాలు
- కంట్రోల్ రూమ్ నెంబరు 9490763489కు సమాచారం ఇవ్వొచ్చు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, ఆగస్టు 2: మద్యం తాగి వాహనాలు నడిపినా, ఆరు బయట మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగాఅధికసంఖ్యలో వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామ న్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 15 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 554మంది వాహనదారులపై కేసునమోదు చేశామన్నారు. ఇందులో 246మందికి తలో రూ.10వేల చొప్పున రూ.24.60 లక్షల జరిమానా కోర్టు విధించిందన్నారు. 96మంది వాహనదారులకు తలో రెండు రోజుల జైలు శిక్షలు విధించగా కోర్టు విచారణలో 202 కేసులు ఉన్నాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి 747మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిలో 243మందికి రూ.86,900 జరిమానా విధించామన్నారు. కోర్టులో 504 కేసులు ఉన్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, మద్యం తాగి వాహనాలు నడిపినా డయల్ 100, 112తోపాటు కంట్రోల్ రూమ్ నెంబర్ 9490763489 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా ఎస్పీ వాట్సాప్ హెల్ప్ నెంబర్ 9494933233కు కూడా సమాచారం అందించాలని కోరారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 2: కాకినాడ పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతంగా చేయాలని పిలుపునిచ్చారు. ఆయా శాఖల పరిధిలో అత్యుత్తమ సేవలందించిన వారి పేర్లను అవార్డులకు సిఫార్సు చేయాలని సూచించారు. అవార్డుకు గౌరవం పెరిగేలా ఉత్తమ పనితీరు కనబర్చిన వారిని మాత్రమే గుర్తించి ఈనెల 10 లోపు పంపించాలన్నారు. దేశభక్తిని పెంచే వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనికి స్వాతంత్ర్య సమరయోధులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనన్నారు. స్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాట్లు, సౌండ్ సిస్టం, శకటాల వాహనాల ఫిట్‌నెస్ పరిశీలించాలన్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జాతీయ జెండా ఆవిష్కరణ చేస్తారన్నారు. సమావేశంలో డీఎఫ్‌వో భరణి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆధునిక సాంకేతికను ఉపయోగించుకోవాలి

- బోటు ఓనర్లు, ఎస్ఐఎఫ్‌టీ విద్యార్థుల సదస్సులో వక్తలు

కాకినాడ సిటీ, ఆగస్టు 2: మత్స్యకారులు ఆధునిక సాంకేతికను ఉపయోగించుకోవాలని, తద్వారా తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని వక్తలు అన్నారు. కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ సెమినార్ హాల్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. 'టచింగ్ లైవ్స్ వైల్ టచింగ్ ద మూన్: ఇండియాస్ స్పేస్ సాగ..' పేరుతో బోటు ఓనర్లు, ఎస్ఐఎఫ్‌టీ విద్యార్థులకు ఈ సదస్సు ఏర్పాటు చేశారు. భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య మంత్రిత్వ శాఖ, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రైనింగ్(సిఫ్ నెట్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఫిషింగ్ వెసల్ కమ్యూనికేషన్ పరికరాల్లో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ పాత్ర, దాని పనితీరును మత్స్యకారులకు వివరించారు. ఇస్రో రూపొందించిన ట్రాన్స్‌పాండర్ల విధులు, ఉపయోగాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించి మత్స్యకారులకు చూపించారు. ఈ పరికరాలను త్వరలో ఫిషింగ్ బోట్లకు అమరుస్తామని తెలిపారు. ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ సుమలత, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్, నాటికల్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అధికారి జి.వెంకటేశ్వర్లు, బోధకుడు గజానన యాదవ్, జిల్లా మత్స్యశాఖ అధికారి కరుణాకరరావు, మెకనైజ్డ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.నాగేశ్వరరావు, ఫిషింగ్ బోటు యజమానులు, సాగర మిత్రలు పాల్గొన్నారు.

ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ
ముందుకు కదిలేనా?



ఏలేరు వరద వస్తే ఇలా పంట పొలాలు, రహదారులు ఏకం

- పనులపై పెరుగుతున్న ఆశలు
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 250శాతం పెరిగిన అంచనాలు
- డిప్యూటీ సీఎం పవన్ ప్రకటించిన ప్రాధాన్య పనుల్లో అగ్రస్థానం
- శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజల ఎదురుచూపులు

పిఠాపురం/గొల్లప్రోలు, ఆగస్టు 2: మెట్టప్రాంతానికి సాగునీరు అందించే వరప్రదాయినిగా పేరుగాంచిన ఏలేరు రిజర్వాయర్ ఆధునీకీకరణకు నోచుకోక దుఃఖదాయినిగా మారింది. జిల్లాలోని పిఠాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, పెద్దాపురం నియోజకవర్గాల పరిధిలో ఉన్న 67,500 ఎకరాలకు ఏలేరు రిజర్వాయర్ ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అదే సమయంలో పీబీసీ, పంపా ఆయకట్టుకు సాగునీటిఎద్దడి ఏర్పడి సమయాల్లో ఇక్కడినుంచే సాగునీటిని మళ్లించి పంటల సాగు చేసుకునే వీలు కల్పిస్తారు. రిజర్వాయర్ నిర్మాణంతోపాటు పంటపొలాలకు సాగునీరు, ఎగువ ప్రాంతాలనుంచి వచ్చే వరద నీరు సముద్రానికి వెళ్లేలా వరద కాలువల నిర్మాణం జరగాల్సి ఉంది. రిజర్వాయర్ ప్రారంభించి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కాలువల ఆధునికీకరణ జరగలేదు. అధిక వర్షాలు కురిస్తే ఏలేరుతోపాటు సుద్దగడ్డకు భారీ వరదలు సంభవించి రైతులు, ప్రజలకు భారీ నష్టాలను మిగులుస్తున్నాయి. గత 36ఏళ్లలో ఏలేరు, సుద్దగడ్డ కాలువలకు 52సార్లు వరదలు సంభవించగా ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రైతులు రూ.950కోట్లు విలువైన పంటలను కోల్పోయారు. ఆస్తినష్టం భారీగానే ఉంది. మిగిలిన అన్ని నియోజకవర్గాలతో కలుపుకుంటే ఇది రూ.1400కోట్లవరకూ ఉంటుంది. ఇప్పటి వరకూ వచ్చిన వరదల్లో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అధికవర్షాల సమయంలో ముంపు సమస్య ఎదుర్కొంటుండగా వర్షాలు లేనిప్పుడు నీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారు.

హామీల వరద మిగిలింది

నాలుగు దశాబ్దాలకు పైగా ఉన్న ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు లేకపోగా హామీల వరద మాత్రం మిగిలింది. ఏలేరు, సుద్దగడ (కొండ) కాలువలను ఆధునికీకరించి వరద ముంపు నుంచి పిఠాపురం నియోజకవర్గంతోపాటు ఏలేరు ప్రాంతానికి శాశ్వత రక్షణ కల్పిస్తామని అధికారంలోఉన్న సమయంలో ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షంలో ఉన్న నాయకులు హామీలు ఇవ్వడం, అవి ప్రకటనలకే పరిమితం కావడం జరుగుతూ వచ్చింది. తరచూ వరదలు రావడం, భారీగా ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నా నేతల్లో స్పందన లేకపోవడాన్ని నిరసిస్తూ 2013లో గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీవాసులు 30వ వరద వార్షికోత్సవం, ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం మా ఈబీసీ కాలనీ వరదను తిలకించడానికి వస్తున్న ప్రజాప్రతినిధులకు ఇదే స్వాగతం, వస్తున్నారు, చూస్తున్నారు, వెళ్తున్నారు అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇది జరిగి దశాబ్దం గడుస్తున్నా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో ఏడాది క్రితం ఇదే ఫ్లెక్సీని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి వరద ముంపు బాధితులు తమ నిరసన తెలియజేశారు. ఇది అప్పట్లో ట్రెండింగ్‌గా నిలిచింది. వరదల కారణంగా గొల్లప్రోలు పట్టణంలో ఉన్న అన్ని కాలనీలు తరచూ ముంపునకు గురవుతున్నాయి. అధికంగా వర్షాలు పడితే వీరు వరదనీటితో సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

టీడీపీ హయాంలో మొదలై.. వైసీపీ పాలనలో రద్దయి

ఏలేరు ఆధునికీకరణ పనులకు టీడీపీ పాలనలోనే మోక్షం లభించింది. అంతకుముందు పలుమార్లు శంకుస్థాపనలు జరిగినా పనులు మాత్రం జరగలేదు. 2009 అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలలు ముందు నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఏలేరు ఆధునికీకరణ పనులకు ఆయకట్టుతో సంబంధం లేని ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో శంకుస్థాపన చేశారు. పనులు జరగకపోగా నిధులు విడుదల చేయలేదు. అది శిలాఫలకానికే పరిమితమైంది. 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే తరహాలో అప్పటి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేసిన శంకుస్థాపన శిలాఫలకాలే మిగిలాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.127.58కోట్లతో ఏలేరు మొదటి విడత ఆధునికీకరణ పనులు చేపట్టి 55శాతం వరకూ పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బిల్లులు నిలిపివేయడంతోపాటు గతంలో సేకరించిన భూములకు పరిహారం ఇప్పటివరకూ ఇవ్వలేదు. దీంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశారు. దీన్ని సాకుగా చూపి వైసీపీ ప్రభుత్వం పనులను రద్దు చేసింది. ఏలేరు మొదటి విడతతో పాటు ఏలేరు ఆధునికీకరణ ఫేజ్-2లో భాగంగా సుద్దగడ్డ, ఏలేరు కాలువలైన నక్కలఖండి, పెదయేరు ఆధునికీకరణ చేపట్టాలని అప్పటి ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తదితరులు ఒత్తిడి తేవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.145కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి ఖరారు చేశారు. ఈ పనులకు 2019, జనవరి 4న సీఎం హోదాలో చంద్రబాబు కాకినాడలో శంకుస్థాపన చేయగా స్థానికంగా ప్రజాప్రతినిధులు భూమిపూజ నిర్వహించారు. పనులు ప్రారంభమైన వెంటనే ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడం జరిగాయి. ఈ పనులను రివర్స్ టెండరింగ్ పేరుతో వైసీపీ సర్కారు రద్దు చేసింది.

హామీ ఇచ్చి.. కార్యాచరణ ప్రకటించి..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ చేపట్టి పిఠాపురం నియోజకవర్గానికి వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పిస్తానని పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇదే విషయాన్ని ఆయనకు మద్దతుగా నిలిచిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రకటించడంతోపాటు పోటీ విరమణ సమయంలో పార్టీ అధినేత చంద్రబాబు ద్వారా ప్రకటన ఇప్పించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తనను భారీ మెజార్టీతో నెగ్గించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకు పిఠాపురంలో నిర్వహించిన సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు అత్యంత ప్రాధాన్యమిస్తామని, పనులు చేపట్టి వరద ముంపు లేకుండా చేస్తామని ప్రకటించారు. ఈ పనులు పూర్తికి కొంత సమయం పడుతుందని తెలిపారు. పవన్ ప్రకటనలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనుల్లో మళ్లీ కదలిక వస్తుందని రైతులు, ప్రజలు ఆశిస్తున్నారు. ఇప్పటినుంచి ప్రక్రియ ప్రారంభిస్తే సార్వా, దాళ్వా సాగు తర్వాత తక్షణం పనులు చేపట్టే వీలుంటుందని, ఆ దిశగా ఆలోచన చేయాలని వారు కోరుతున్నారు.

అంచనాలు పెరిగాయి.. పనులకు మోక్షం లభించలేదు

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణలో ఒక్క అడుగు ముందుకు పడలేదు సరికదా అప్పటివరకూ జరిగిన పనులను అర్ధంతరంగా నిలిపివేసి వాటిని రద్దు చేసింది. ఈ పనులు నిలిపివేయడం, రద్దు చేసిన టెండర్లను తిరిగి పిలవకపోవడంతో టీడీపీ ఆధ్వర్యంలో పలు ఆందోళనలు నిర్వహించారు. నిరసనలు తీవ్రస్థాయికి చేరుతున్నాయని భావించిన వైసీపీ ప్రజాప్రతినిధులు 2012, జూలై 28న నిర్వహించిన కాపు నేస్తం సభలో ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ గురించి సీఎం జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సీఎం ఆర్భాటంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏలేరు ఆధునికీకరణ మొదటి విడత పనుల పూర్తికి రూ.142కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకుగాను ఫేజ్-2కు రూ.150కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఇక పనులు ప్రారంభమే తరువాయి అన్నంత హడావుడి చేశారు. సీఎం ప్రకటన తర్వాత తాజాగా మిగిలిన ఏలేరు ఫేజ్-1 పనుల పూర్తికి, సేకరించిన భూముల పరిహారానికి రూ.230కోట్లు, ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ ఫేజ్-2కు భూసేకరణ సహా రూ.513కోట్లు, ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.2కోట్లు, తిమ్మరాజుచెరువు ఆధునికీకరణకు రూ.7కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనాలు తయారు చేశారు. రూ.750కోట్లతో రూపొందించిన ఈ అంచనాలకు వైసీపీ హయాంలో 20నెలలకు పైగా ఎదురుచూసినా మోక్షం మాత్రం లభించలేదు. ఐదేళ్ల పాలనలో కనీసం అరశాతం పనులు జరగకపోగా జరుగుతున్న పనులు నిలిచిపోయి అంచనాలు మాత్రం 250శాతంపైగా పెరిగాయి.



రావి ఆకుపై పింగళి వెంకయ్య



గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: లీఫ్ కార్వింగ్ కళ ద్వారా జాతీయ పతాకం రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి నూకాలమ్మ గుడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నల్ల బల్లలపై వెంకయ్య చిత్రాన్ని గీయడంతో పాటు రావి ఆకుపై చిత్రించిన ఆయన చిత్రాన్ని చూపి జీవిత చరిత్రను వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు నాయుడు వెంకటేశ్వరరావు, జి.శివప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనాలు ప్రారంభం



మామిడికుదురు, ఆగస్టు 2: వరదల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో కొన్ని రోజులుగా నిలిపివేసిన బాలబాలాజీ స్వామి దర్శనాలను శుక్రవారం పునఃప్రారంభించారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకోవాలని సహాయ కమిషనరు జి.మాధవి కోరారు.

నేడు జీఎస్ఎల్‌లో ఐఎంఏ కాన్ఫరెన్స్

రాజానగరం, ఆగస్టు 2: జనరల్ ప్రాక్టీషనర్ల సేవలను బలోపేతం చేసే దిశగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో శనివారం జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సోమనాథ్ దాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 500 మంది జనరల్ మెడిసిన్ ఫిజీషియన్లు పాల్గొంటారని డైరెక్టర్ ఆఫ్ స్టడీస్ డాక్టర్ పీఎస్ శర్మ తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు కాన్ఫరెన్స్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేశ్ ప్రారంభిస్తారని ఐఎంఏ రాజమహేంద్రవరం ప్రెసిడెంట్ డాక్టర్ వై.గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ విజయ భాస్కర్ తెలిపారు. ఐఎంఏ ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి విభాగాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పేపర్ ప్రజెంటేషన్లు, చర్చాగోష్ఠులు, కీలకోపన్యాసాలు ఉంటాయన్నారు. ఐఎంఏ డీన్ డాక్టర్ సత్యజిత్ బోరా, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ వీఎస్‌వీఎల్ నరసింహం, డాక్టర్ బీసీ రాయ్ తదితర ప్రముఖులు పాల్గొంటారని డాక్టర్ సోమనాథ్ దాస్ వివరించారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐటీఐ ఉత్తీర్ణులైన వారి నుంచి ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం దరఖాస్తులు కోరుతున్నామని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లకు సంబంధించి ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ (www.apprenticeshipindia.gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు 10వ తరగతి, ఐటీఐ మార్కుల జాబితా, ఆధార్, బయోడేటా, తపాలా చిరునామా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలవారు కుల ధ్రువీకరణపత్రం జతచేయాల్సి ఉందన్నారు. వచ్చిన దరఖాస్తులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ఆగస్టు 27న విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో జరుగుతుందని పేర్కొన్నారు.

నీలి నీలి ఆకాశం

కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం నీలి రంగులోకి మారి ప్రజలను కనువిందు చేసింది. ఈ దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కాయి.



కాకినాడ ఇంద్రపాలెంలో...



రాజమహేంద్రవరం నాలుగో బ్రిడ్జి వద్ద...

గోదావరి తగ్గినది

- సాధారణ స్థాయికి ప్రవాహం
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ధవళేశ్వరం, ఆగస్టు 2: గత రెండు వారాలుగా ఉరకలేసి ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గి 9.86లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దీంతో 11 రోజులుగా కొనసాగిన మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై నీటిమట్టం రాత్రి 7గంటలకు 10.50అడుగులకు తగ్గింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 8,37,740 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో అన్నిచోట్లా నీటిమట్టం తగ్గుముఖం పట్టి సాధారణ స్థాయికి చేరుకుంటున్నాయి. భద్రాచలం వద్ద శుక్రవారం రాత్రి 7గంటలకు నీటి మట్టం 34.10 అడుగులుగా నమోదైంది.

1,481 టీఎంసీలు సముద్రం పాలు

వరదల సీజను మొదలై ఇప్పటివరకు అంటే జూన్ నెల నుంచి శుక్రవారం వరకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 1481.79 టీఎంసీల వరద నీరు సముద్రంలోకి ప్రవహించింది. ఏప్రిల్‌లో గోదావరిలో లభించిన నీరు కేవలం 2టీఎంసీలు మాత్రమే. గోదావరికి వరద ప్రవాహం వచ్చి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10లక్షల క్యూసెక్కులు ప్రవహించడంతో జూలై 22న మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ప్రవాహం మరింత పెరగడంతో 23న రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై వరద ప్రవాహం తగ్గడంతో 25న రెండో ప్రమాదహెచ్చరికను ఉపసంహరించగా నీటిమట్టం 13.75 అడుగులకు పెరగడంతో 27న రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. నీటిమట్టం క్రమంగా పెరుగుతూ 15.80 అడుగులకు చేరుకోగా 16లక్షల క్యూసెక్కులు పైగా సముద్రంలోకి ప్రవహించింది. నీటిమట్టం తగ్గడంతో 30న రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై గోదావరి తగ్గుతూ, పెరుగుతూ, నిలకడగా కొనసాగడంతో మూడు రోజుల పాటు మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగింది. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. 11రోజుల వ్యవధిలో 1207 టీఎంసీల వరద నీటిని సముద్రం లోకి వదిలారు. ఈ నీటితో మూడు డెల్టాల పరిధిలో ఏటా రెండు పంటలకు 10లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించవచ్చు.



కాటన్ బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

పోశమ్మగండి వద్ద తగ్గిన ఉధృతి

దేవీపట్నం, ఆగస్టు 2: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నదులు పొంగి ప్రవహించి గోదావరిలో కలిసాయి. దీంతో మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతాలు నీట మునిగాయి. రెండు రోజులుగా వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం శుక్రవారం వరద నీటి నుంచి బయటపడింది. గోదావరి వరద ఉధృతి తగ్గుతుండడంతో పలు వాగులు నిలకడగా ప్రవహిస్తున్నాయి.



దుర్గాడ శివాలయంలో వైభవంగా శత రుద్రయాగం

రామలింగేశ్వర స్వామికి శాకంబరీ అలంకారం





గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 2: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసియున్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి శుక్రవారం శతరుద్రయాగం వైభవంగా జరిగింది. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం కలిసి రావడంతో స్వామికి శాకంబరీ అలంకారం చేశారు. గీతా వెంకటేశ్వర స్మార్త యాజుష ఆగమ పాఠశాల స్మార్త విద్యార్థులతో ఘంటసాల సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో మహాగణపతి, పుణ్యావాహచనం, మండపారాధన, సూర్యనమస్కారాలు, శాంతి కల్యాణం, మహారుద్ర హోమం, సౌర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు స్వామికి సప్త హారతులు ఇచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏలూరు రేంజ్ పరిధిలో సీఐలకు స్థానచలనం

ఏలూరు క్రైం, ఆగస్టు 2: ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న సీఐలలో 41 మందిని బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలో పని చేస్తున్న 41 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వివిధ కారణాల వల్ల ఇద్దరు సీఐల బదిలీలు నిలిపివేసినట్లు సమాచారం. పోలవరం సీఐగా పనిచేస్తున్న మధుబాబు, గన్నవరం ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న పెద్దిరాజుల బదిలీలను నిలిపివేస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. అలాగే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అతి చేసిన కొందరిని ప్రభుత్వం వీఆర్‌కు పంపింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
ఆర్.అంకబాబు	వీఆర్ కాకినాడ	సామర్లకోట యూపీఎస్
డి.సురేష్	సామర్లకోట యూపీఎస్	(వీఆర్)ఏలూరు రేంజ్
టి.క్రాంతికుమార్	జీలుగుమిల్లి సర్కిల్	పెద్దాపురం సర్కిల్
వై.రవికుమార్	పెద్దాపురం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.చెన్నకేశవరావు	వీఆర్ ఏలూరు రేంజ్	తుని రూరల్ సర్కిల్
ఎస్‌వీవీఎస్ మూర్తి	తుని రూరల్ సర్కిల్	వీఆర్, ఏలూరు రేంజ్
ఎం.మోహన్‌కుమార్	వీఆర్ ఏలూరు రేంజ్	ముమ్మడివరం సర్కిల్
ఎన్.కొండయ్య	ముమ్మడివరం సర్కిల్	తణుకు టౌన్ పీఎస్
సీహెచ్ విద్యాసాగర్	ఇనగుదురు(కృష్ణా)	రావులపాలెం సర్కిల్
ఎం.రాంకుమార్	రావులపాలెం సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
పి.విశ్వం	దిశా పోలీస్‌స్టేషన్ ఏలూరు	కొవ్వూరు టౌన్ యూపీఎస్
వి.జగదీశ్వరరావు	కొవ్వూరు టౌన్ యూపీఎస్	ఆకివీడు సర్కిల్
కె.రజనీకుమార్	సీసీఎస్-2 తూర్పుగోదావరి	పాలకొల్లు టౌన్ యూపీఎస్
కె.మంగాదేవి	పాలకొల్లు టౌన్ యూపీఎస్	అటాచ్డ్ టు తూర్పుగోదావరి
బి.ఎస్.చైతన్యకృష్ణ	కాకినాడ ట్రాఫిక్- 2 పీఎస్	కాకినాడ రూరల్ సర్కిల్
ఎ.శ్రీనివాస్	కాకినాడ రూరల్ సర్కిల్	(వీఆర్) ఏలూరు రేంజ్
బొక్కా పెద్దిరాజు	వీఆర్, ఏలూరు రేంజ్	సర్పవరం పీఎస్
వై.ఆర్.కె.శ్రీనివాస్	సర్పవరం పీఎస్	(వీఆర్) ఏలూరు రేంజ్
జి.మధుబాబు	పోలవరం సర్కిల్	రాజమహేంద్రవరం త్రీటౌన్
వీరయ్యగౌడ్	రాజమహేంద్రవరం త్రీటౌన్	(వీఆర్) ఏలూరు రేంజ్
కె.విజయబాబు	టీసీఎస్-1 రాజమహేంద్రవరం	కొవ్వూరు రూరల్ సర్కిల్
పి.శ్రీనివాసరావు	కొవ్వూరు రూరల్ సర్కిల్	(వీఆర్)ఏలూరు రేంజ్

ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించి పండుగలను గుర్తించాలి

బ్రాహ్మణ పంచాంగకర్తల సంఘం డిమాండ్

సర్పవరం జంక్షన్, ఆగస్టు 2: ధృక్ సిద్ధాంత ప్రామాణికంగా నిర్దేశించిన పండుగలను మాత్రమే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని తెలుగు రాష్ట్రాల ధృక్ సిద్ధాంత పంచాంగకర్తల సమాఖ్య డిమాండ్ చేసింది. శుక్రవారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట శివారు రాయుడుపాలెంలోని బ్రాహ్మణ భవనలో సంఘ కార్యదర్శి పొన్నలూరి శ్రీనివాస గార్గేయ అధ్యక్షతన పంచాంగకర్తలతో సదస్సు నిర్వహించారు. గార్గేయ సిద్ధాంతి, గొర్తి పట్టాభిశాస్త్రి, తెలంగాణ పంచాంగకర్తల అధ్యక్షుడు అవసరాల ప్రకాశ్‌శర్మ మాట్లాడుతూ... పూర్వ పద్ధతి గణన మున్నాటికీ తప్పేనని, దీనివల్ల పండుగ నిర్ణయాలపై ప్రజల్లో అయోమయం, గందరగోళం నెలకొందన్నారు. ధృక్ గణిత పంచాంగం ఆధారంగా పండుగలు నిర్ణయించి ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. టీటీడీ తమిళ పంచాంగాన్ని ధృక్ సిద్ధాంతం ఆధారంగా ప్రచురిస్తున్నారని, తెలుగు పంచాంగాన్ని మాత్రం పూర్వ పద్ధతిలో నిర్ణయించడంతో అపోహలు వీడట్లేదన్నారు. ఒక్క శృంగేరి పీఠం తప్ప, కంచి కామకోటి పీఠంతో సహా దేశంలోని అన్ని పీఠాలు ధృక్ సిద్ధాంతాన్ని ఆమోదించాయన్నారు. సమావేశానికి హాజరైన 36 మంది పంచాంగకర్తలు పలు... ఆదిత్య, నాగార్జున ఆదిత్య, నిట్టల వెంకటశివరామకృష్ణ, ఎక్కిరాల రామకృష్ణ, పి.రవిశంకర్, పి.చంద్రశేఖర్, నిర్మలానంద స్వామి, కారుపర్తి నాగేమల్లేశ్వర సిద్ధాంతి, దేవరభొట్ల భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న పంచాంగకర్తల ప్రతినిధులు



సతీష్‌కు నియామక పత్రం అందజేస్తున్న జిల్లా గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్య శర్మ

పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా గుర్తించాలి

రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్య శర్మ

కడియం, ఆగస్టు 2: పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కులవృత్తిగా ప్రభుత్వం గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కోరింది. తూర్పు గోదావరి జిల్లా వేమగిరిలోని పార్వతీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య మొదటి సమావేశం జిల్లా గౌరవాధ్యక్షుడు జోస్యుల సుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన జరిగింది. తొలుత సంఘం యువజన విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితుడైన కొత్తూరి సతీష్‌తో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ఆలయాల్లో పౌరోహిత్యం చేసే పురోహితులను ప్రభుత్వం గుర్తించి, వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన వేదపండితులు, పురోహితులకు పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. అర్చకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అందుకు ఓ కమిషన్ వేయాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాల కమిటీల్లో పురోహితులకు సభ్యుడిగా స్థానం కల్పించాలన్నారు. బ్రాహ్మణులు అపరకర్మలు నిర్వహించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఓ భవనం నిర్మించాలన్నారు. వేద విద్యను అభ్యసించే నిరుద్యోగులకు యువగళం పథకంలో రూ.3 వేలు భృతి ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మర్ల సీతారామశాస్త్రి, గోవిందవఝుల సుబ్రహ్మణ్యశర్మ, కొత్తూరి సతీష్, ఎ.సురేంద్రబాబు, కడియం గాయత్రీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, ఎస్‌వీఎల్ నరసింహారావు, కేవీ సుబ్బారావు, పాలగుమ్మి శేషగిరిరావు, బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వైద్య సేవల నిర్లక్ష్యంపై సీఎంకు ఫిర్యాదు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 2: రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపించినవైద్యురాలు, ఇతర వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆరోగ్య శాఖ మంత్రిలకు ఫిర్యాదు చేసినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరుకు చెందిన ఖండవల్లి భరత్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 31న భరత్‌కుమార్ తన కుమారుడు లీలా శ్రీకర్‌తో కలసి రాజమహేంద్రవరం సమీపంలోని డాక్టర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీకి స్పాట్ అడ్మిషన్లకు వస్తుండగా రాజవోలు దాటిన తర్వాత వారి వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో లీలా శ్రీకర్‌కు కుడిచెయ్యి విరిగింది. గాయాలతోనే కాలేజీకి చేరుకుని స్పాట్ అడ్మిషన్ పూర్తిచేసుకున్న తర్వాత చికిత్స కోసం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు వెళ్లారు. ఎమర్జన్సీ ఓపీ తీసుకుని ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యురాలి వద్దకు వెళితే చాలాసేపు బయటే నిలిపివేసి వైద్య సేవలు అందించడంతో నిర్లక్ష్యం చూపారన్నారు. తన కుమారునికి చెయ్యి విరిగిందని అనుమానంగా ఉందని ఎక్స్‌రే రాయాలని కోరితే చీటీ రాసిచ్చారని, ఎక్స్‌రే తీసిన తర్వాత ఆర్థోపెడిక్ డాక్టర్ గది వద్దకు వెళితే అక్కడ ఎవరూ లేరని భరత్‌కుమార్ ఆరోపించారు. దీంతో తనకు భయం వేసి రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకోవాలని భరత్‌కుమార్ కోరారు.



నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు, ఎస్ఈబీ అధికారులు

రూ.14.50 లక్షలు విలువైన నాటుసారా, మద్యం సీసాలు ధ్వంసం

పెద్దాపురం, ఆగస్టు 2: కాకినాడ జిల్లా పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన నాటుసారా, మద్యం సీసాలను పోలీసు, ఎస్ఈబీ అధికారులు శుక్రవారం ధ్వంసం చేశారు. స్థానిక పోలీస్ క్వార్టర్ వద్ద ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ దొర, డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో 287 కేసుల్లో పట్టుబడిన రూ.14,50,947 విలువైన నాటుసారా, మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాటుసారా తయారీ కేంద్రాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని, సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సామర్లకోట, జగ్గంపేట సీఐలు అంకబాబు, లక్ష్మణరావు, ఎస్ఐలు వెలుగుల సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

5న కాకినాడలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 2: వికాస ఆధ్వర్యంలో ఈ నెల 5న కాకినాడలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కెలచ్చారావు తెలిపారు. ఎస్‌డీవీవీఎల్ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్‌లో సర్వే ఇంజనీర్, డిజైనింగ్ ఇంజనీర్ అండ్ సైట్ ఇంజనీర్, శ్రీరామ్ కాన్‌టాక్ట్ సెంటర్లో కస్టమర్ రిలేషన్ ఆఫీసర్, టెలికాలింగ్ ఎగ్జిక్యూటివ్ అండ్ డేటా సోర్స్ ఎగ్జిక్యూటివ్ డిక్సాన్, హోండాయ్ మోబిస్ అండ్ రాక్‌మెన్ ఇండస్ట్రీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు .12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయి. ఆసక్తి గలవారుసోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 ను సంప్రదించాలన్నారు.

మోటారు సైకిలును ఢీకొన్న కారు

ముగ్గురికి తీవ్ర గాయాలు



గోకవరం, ఆగస్టు 2: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం వెంకటాపురం గ్రామ శివారులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... దేవీపట్నం మండలం ఇందుకూరుపేట నుంచి తుర్రం సురేష్, అతని భార్య భవాని, కుమారుడు హేమంత్ కుమార్‌దొర మోటార్ సైకిలుపై రంపచోడవరం మండలం కె.ఎర్రంపాలెం (అత్తగారుఇంటికి) బయల్దేరారు. మండలంలోని వెంకటాపురం వెళ్లేసరికి రంపచోడవరం వైపు నుంచి గోకవరం వైపు వస్తున్న కారు వీరి మోటారు సైకిలును బలంగా ఢీకొంది. ఈ ఘటనలో సురేష్, భవాని, కుమార్‌దొర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు గోకవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ కార్యాలయం కూల్చివేతకు..

రాజమహేంద్రవరం కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు

అమరావతి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. పార్టీ కార్యాలయ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు, బిల్డింగ్ ప్లాన్ వివరాలను జతచేస్తూ భవన నిర్మాణ అనుమతి రెన్యువల్ కోసం అధికారులకు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని పిటిషనర్లకు సూచించింది. అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయాల విషయంలో జూలై 4న ఈ కోర్టు ఇచ్చిన ఆదేశాలకు, చట్టనిబంధనలకు లోబడి ఆ దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రత్యక్షంగా హాజరై వాదనలు వినిపించేందుకు పిటిషనర్లకు అవకాశం ఇవ్వాలని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులు అందిన తర్వాత రెండు నెలల్లో దరఖాస్తు పరిష్కరించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణ అనుమతుల రెన్యువల్ కోసం ప్రత్యక్షంగా దరఖాస్తు సమర్పించేందుకు పిటిషనర్లకు వెసులుబాటు ఇచ్చింది. దానిపై తుది నిర్ణయం వెల్లడించేంతవరకు వైసీపీ కార్యాలయ భవనం విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశించింది. నిర్మాణాలు కొనసాగించవద్దని పిటిషనర్లకు తేల్చిచెప్పింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పాముకాటుతో కౌలు రైతు మృతి

పిఠాపురం రూరల్, ఆగస్టు 2: పాముకాటుకు గురయి కౌలురైతు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకివాడలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన కౌలు రైతు కొమ్ము నాగేశ్వరరావు(58) పొలం పనులకు వెళ్లి గడ్డి కోస్తున్నాడు. అక్కడ పాము కాటుకు గురయ్యాడు. ఇంటికి వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ జిల్లా కమిటీ మాజీ సభ్యుడు కొమ్ము చినబాబుకు సోదరుడు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలేశ్వరం, ఆగస్టు 2: ఏలేశ్వరం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం నగరపంచాయితీ పరిధిలో నర్సీపట్నం రోడ్డు, లింగంపర్తి, రోడ్డు, యర్రవరం రోడ్డు, శివాలయం, షిర్డీ నగర్, మార్కెట్ రోడ్డు.. మండలంలో భద్రవరం, లింగంపర్తి, సి.రాయవరం, తూర్పులక్ష్మీపురం, జె.అన్నవరం, కిమ్మూరు, రమణయ్యపేట శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పేర్కొన్నారు.

ఉచిత టెట్, డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం


కోచింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

జగ్గంపేట, ఆగస్టు 2: గోకవరం రోడ్డులో గల కాపు కల్యాణ మండపంలో జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత టెట్, డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ ప్రారంభించారు. శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విద్యార్థులకు డీఎస్సీ బుక్స్ పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఈ కోచింగ్ సెంటర్ ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, పిఠాపురం, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్‌లు మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మలపల్లి రమేష్, టీడీపీ, బీజేపీ, నాయకులు దాట్ల కృష్ణవర్మ, ఎస్‌వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్యదొర, మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, కొత్త కొండబాబు, చదరం చంటిబాబు, మంగ రౌతు రామకృష్ణ, పరిమి బాబు, కందుల చిట్టిబాబు, కుంచేరాజా, సర్పంచ్ బచ్చల నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

'రెడ్‌క్రాస్‌కు జాతీయస్థాయి గుర్తింపు గర్వకారణం'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 2: జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ తన నిరుపమానమైన సేవలతో జాతీయస్థాయి గుర్తింపు పొందడం గర్వకారణమని బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. రెడ్‌క్రాస్ నిర్వహించిన వాత్సల్య వృద్ధాశ్రమం, వికలాంగ బాలుర పాఠశాల, తలసేమియా సేవా కేంద్రం, బ్లడ్ బ్యాంకు, ఐబ్యాంకులను శుక్రవారం సందర్శించిన ఆయన రెడ్‌క్రాస్ నిర్వాహకులు, సిబ్బందిని ఉద్దేశించి సందేశం ఇచ్చారు. అకుంఠిత సేవాభావంతో చైర్మన్ వైడీ రామారావు సారథ్యంలో కలెక్టర్ నేతృత్వంలో రెడ్‌క్రాస్ ఎంతోమంది జీవితాలకు తన సేవల ద్వారా భరోసాని కల్పిస్తోందని, ఎన్నో రకాల సేవలను అందిస్తూ ఈ సంస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చాగంటిని చైర్మన్ రామారావు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె.శివకుమార్, కోశాధికారి ప్రసాద్‌బాబు, కార్యవర్గ సభ్యులు బాదం బాలకృష్ణ, ఎస్‌వీఎం చంద్రశేఖర్, ఆకెళ్ల శాస్త్రి, ఎం.విశ్వేశ్వరరావు, వైద్యాధికారులు డాక్టర్ ఎస్‌వీ రావు, డాక్టర్ దుర్గరాజు, డాక్టర్ పరాశర, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రైన్లను పరిశీలించిన కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 2: నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణతోపాటు పలు జంక్షన్లలో డ్రైన్లను నగరపాలక సంస్థ కమిషనర్ భావన శుక్రవారం పరిశీలించారు. భానుగుడి సెంటర్, టూటౌన్ ఫ్లైఓవర్ సెంటర్ మీదుగా పర్యటించి పారిశుధ్య నిర్వహణ అమలు తీరును గమనించారు. పలుచోట్ల వర్షపునీరు నిల్వ ఉండడాన్ని గుర్తించి నిలిచిపోకుండా చూడాలని సూచించారు. టూటౌన్ సాయిబాబా గుడి వద్ద ఉన్న ప్రధాన కల్వర్టును పరిశీలించారు. వ్యాపార సముదాయాల నుంచి చెత్త సేకరణ వంటి విషయాలపైనా ఆరాతీశారు. ఆమె వెంట ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ నాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

సామర్లకోట, ఆగస్టు 2: విద్యకు ప్రభుత్వం వివిధ రూపాలలో అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తును పొందాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్ అన్నారు. పట్టణ పరిధిలో యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్టూడెంట్ కిట్‌ల పంపిణీ నిర్వహించారు. అచ్చుపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బేగ్‌లు, షూలుతో కూడిన విద్యా సామాగ్రిని రంగనాగ్ అందజేశారు. పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

ఏలేశ్వరం: స్థానిక బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన బ్యాగులు, పుస్తకాలను మాజీ కౌన్సిలర్లు సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, శ్రీను, మార్కెట్ కమిటీ సభ్యులు పైల విజయ్, సొసైటీ సభ్యులు సిరిపురపు రాజేష్, అలమండ దుర్గా ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు వట్టి వెంకటరమణ అందజేశారు.

రౌతులపూడి: గిడజాం, ఎస్.పైడిపాల గ్రామాల్లో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్లు అందజేశారు. పందులు తాతారావు, తంటపురెడ్డి రమణ, తంటపురెడ్డి అప్పారావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విద్యాకిట్ల పంపిణీ వివాదాస్పదం

రౌతులపూడి, ఆగస్టు 2: ఎస్.పైడిపాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యాకిట్ల పంపిణీ వివాదాస్పదమైంది.పంపిణీలో పాల్గొన్న వైసీపీ నేతల్లో జడ్పీటీసీ గొల్లు చిన దివాణంకు మాత్రమే ప్రొటోకాల్ ఉండగా, ప్రొటోకాల్ లేని ఎంపీటీసీ భర్త రాయి ప్రసాద్, సర్పంచ్ భర్త జిగిరెడ్డి సత్తిబాబు, వైసీపీ కార్యకర్తలు గొల్లు వెంకటరమణ, పారేపల్లి శ్రీరాం కృష్ణ పాల్గొన్నారు. టీడీపీ నేతలెవ్వరు హాజరుకాలేదు. టీడీపీ నేతల పట్ల ప్రధానోపాధ్యాయుడు తీరు బాగోలేదు. గురువారం పేరేంట్స్ మీటింగ్‌లో ఓటర్ లిస్టు అడగగా ఇవ్వకపోగా దురుసుగా సమాధానం చెప్పడంతో ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కిట్ల పంపిణీలో ప్రొటోకాల్ లేని వైసీపీ నేతలకు ప్రాధాన్యమి వ్వడంపై టీడీపీ నేతలు గొల్లు పెద్దదివాణం, ఈగల సత్తిబాబు ఎమ్మెల్యే సత్యప్రభకు ఫిర్యాదు చేశారు.

తల్లిపాల వారోత్సవాలు

కొత్తపల్లి, ఆగస్టు 2: పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా 20శాతం శిశుమరణాలు నివారించవచ్చని ఐసీడీసీ మూలపేట సెక్టార్ సూపర్‌వైజర్ యువీవీ అనంతలక్ష్మి తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలు, తల్లులతో చేపట్టిన తల్లిపాల వారోత్సవాల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లులు పాలు ఇవ్వడం ద్వారా పిల్లకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వయిరీ ఫౌండేషన్ ప్రతినిధి అనిత తదితరులు ఉన్నారు.

తునిరూరల్: తేటగుంటలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గజ్జి అప్పలరాజు, పేరూరి వెంకటకృష్ణ, కొల్లు సత్తిబాబాబు, కోనా కన్నారావు, అంగన్‌వాడీ టీచర్లు కె.పద్మావతి, మరియమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ధర్మవరంలో ర్యాలీని నిర్వహించగా ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం : పలువురికి గాయాలు

కరప, ఆగస్టు 2: పెనుగుదురులో శుక్రవారం ఒక పిచ్చికుక్క స్వైరవిహారం చేసి పలువురిని గాయపర్చింది. గ్రామానికి చెందిన బందారు బూరయ్య, మరికొంత మందిపై పిచ్చికుక్క దాడిచేసి విచక్షణారహితంగా కరిచింది. దీంతో భయాందోళనలకు గురైన గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పిచ్చికుక్క ఏ క్షణం ఎక్కడ నుంచి దాడిచేస్తుందో అనే భయంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. విషయం తెలిసిన జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బందారు మురళి తాళ్లరేవు నుంచి ఒక వ్యక్తిని పిలిపించి పిచ్చికుక్కను బంధించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నిరసన

జగ్గంపేట, ఆగస్టు 2: శ్రీకాకుళం జిల్లా నందిగాం సంక్షేమ గురుకుల పాఠశాల నందు ఇంటర్ చదువుతున్న అక్షిత మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేటలో నిరసన చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ తక్షణం విద్యాశాఖా మంత్రి స్పందించి విచారణ చేపట్టి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ

ఏలేశ్వరం, ఆగస్టు 2: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా ఫిజియోథెరపీ వైద్యం అందించనున్నట్టు ఎంఈవో వరలక్ష్మీ తెలిపారు. శుక్రవారం స్థానిక భవితా కేంద్రంలో నూతన ఫిజియోథెరపీ డాక్టర్ హెచ్‌వి.దివ్య ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం ఉచితంగా ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు వాణి పద్మజ, బుజ్జి తదితరులు ఉన్నారు.

నలుగురు వాహనదారులకు 2రోజుల జైలు

కాకినాడ క్రైం, ఆగస్టు 2: మద్యం తాగి వాహనాలు నడిపిన 16మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరపరచగా ఇందులో నలుగురికి తలో రెండు రోజుల జైలు శిక్షను విధిస్తూ జడ్జి వి.నరసింహారావు తీర్పునిచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టగా 16మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. వారిని శుక్రవారం మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ నలుగురికి రెండేసి రోజులు జైలుశిక్ష, 12మందికి తలో రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై కేసు

గండేపల్లి, ఆగస్టు 2: ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన 17 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆదిత్య'కు ఈక్విటీ పురస్కారం

గండేపల్లి, ఆగస్టు 2: ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్ 2024-25 సంవత్సరానికి గాను ఎడ్యుకేషన్ వరల్డ్ నుంచి సూరంపాలెంలోని తమ ఆదిత్య యూనివర్శిటీకి గ్రాండ్ జ్యూరీ డైవర్సిటీ, ఇంక్లూసన్ అండ్ ఈక్విటీ పురస్కారం లభించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ అవార్డు స్వీకరించడం ఆనందంగా ఉందని, గౌరవంతో పాటు మరింత బాధ్యత పెరిగిందన్నారు.

భారీ వర్షం

» రహదారులు జలమయం

» పంటపొలాల్లో నిలిచిన నీరు



పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం, గొల్లప్రోలు రాయవరం సెంటర్‌లో నిలిచిన వర్షపునీరు

పిఠాపురం, ఆగస్టు 2: పట్టణంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉన్నప్పటికీ సాయంత్రానికి చినుకులు ప్రారంభమయ్యాయి. అనంతరం గంటన్నర వ్యవధిలో 4సార్లు కురిసిన భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పోలీసుస్టేషన్ సెంటర్, రథాలపేట అంబేడ్కర్ సెంటర్, ఫైర్‌స్టేషన్, పాతబస్టాండు, ఉప్పాడ బస్టాండు, సినిమా సెంటర్, చర్చి సెంటర్, మార్కెట్ సెంటర్, మంగాయమ్మారావుపేట, ఆర్టీసీ బస్‌కాంప్లెక్సు, తారకరామనగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్ల మీదకు నీరు చేరింది. వర్షంతో వాతావరణం చల్లబడింది.

గొల్లప్రోలు: పట్టణం పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వర్షంతో పలు చోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. సుమారు గంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. భారీవర్షంతో ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలోని పంటపొలాల్లో నీరు నిలిచింది. ఇప్పటికే దమ్ములు చేసిన పొలాల్లో నీరు చేరండంతో రైతులు వరినాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు మెట్ట గ్రామాల్లో పత్తి, కాయగూరలు తదితర పంటలకు వర్షం మేలు చేకూర్చింది.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వాతావరణం నెలకొన్న సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కుండపోత వర్షం పడింది. ఖరీఫ్ వ్యవసాయ సాగు పనులు జోరుగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో కురిసిన ఈ వర్షం మెట్ట పొలాలకు ఎంతో మేలు చేకూరుస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వీడని ముంపు!


సిమెంట్ రాళ్లపై కరప ఎంపీడీవో కార్యాలయానికి వస్తున్న అధికారి

కరప, ఆగస్టు 2: నిర్విరామంగా కురుస్తున్న వర్షాలకు కరప మండల పరిషత్ కార్యాలయం రోజుల తరబడిగా ముంపునీటిలో చిక్కుకుని ఉంది. కార్యాలయం చుట్టూ మోకాళ్ల లోతు నీరు చేరడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంచాయతీరాజ్‌శాఖతో బాటు హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ డిపార్ట్‌మెంట్లు ఈ భవనంలోనే కొలువుదీరి ఉన్నా యి. ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి కంటే మం డల పరిషత్ భవనం పల్లంగా ఉండడంతో వర్షంనీరు కార్యాలయం లోపలకు చేరి తటాకాన్ని తలపిస్తుంది. ముంపునీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ఇక్కడ పనిచేస్తున్న ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముంపునీటి సమస్యకు పరిష్కారం దొరక్క ఏళ్లతరబడిగా అధికారులు తిప్పలు పడుతున్నారు.

బురదరోడ్డుతో ఇబ్బందులు


బురదరోడ్డులో వెళ్తున్న విద్యార్థులు

గండేపల్లి, ఆగస్టు 2: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో మల్లేపల్లి అనపురాజుపేట కాలనీలో రోడ్డు బురదమయంగా మారింది. ఆ రోడ్డులో ప్రభుత్వ పాఠశాల ఉండడంతో విద్యార్థులు ఆ బురదలోనే వెళ్లాల్సిన పరిస్థితి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతూ పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తం'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 2: ప్రపంచీకరణ నేపథ్యంలో అనేక రకాల మోసాలు జరుగుతున్నాయని, సైబర్ నేరాల పట్ల అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని సీఐలు బొక్క పెద్దిరాజు, డీఎస్ చైతన్యకృష్ణ కోరారు. సాధారణ బదిలీల్లో భాగంగా గురువారం సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా బొక్క పెద్దిరాజు, కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డీఎస్ చైతన్యకృష్ణలు వారి కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. సర్పవరం ఎస్‌హెచ్‌వోగా పని చేసిన వైఆర్‌కే శ్రీనివాస్‌ను ఏలూరు రేంజ్ కార్యాలయానికి బదిలీ చేశారు. చైతన్యకృష్ణ కాకినాడ ట్రాఫిక్ 2సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇద్దరు సీఐలను ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీఐల బాధ్యతల స్వీకరణ

తునిరూరల్, ఆగస్టు 2: తుని రూరల్ సీఐగా జి.చెన్నకేశవరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత సర్కిల్ ఆఫీస్‌లో పూజలు ఆచరించి సీఐ బాధ్యతలు చేపట్టి మీడియా సమావేశం నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా కట్టడికి పూర్తిస్థాయి చర్యలు చేపడతానన్నారు.

సామర్లకోట: సామర్లకోట పోలీస్‌స్టేషన్ సీఐగా ఆర్.అంకబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది సీఐని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పెద్దాపురం: పెద్దాపురం సీఐగా టి.క్రాంతికుమార్ రానున్నారు. ఇక్కడ పనిచేసిన రవికుమార్ వీఆర్‌కు వెళ్లారు.

దివ్యాంగులకు ఉపకరణాలను గుర్తించేందుకు శిబిరం

పిఠాపురం, ఆగస్టు 2: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను గుర్తించేందుకు పట్టణంలోని రథాలపేట సెంటర్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన శిబిరానికి భారీగా విభిన్నప్రతిభావంతులు తరలివచ్చారు. హైదరాబాదుకు చెందిన అలిమ్కో సంస్థ సౌజన్యంతో ఏపీ విభిన్నప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి 600మంది దివ్యాంగులు హాజరయ్యారు. ఇందులో గుర్తించిన దివ్యాంగులకు అలిమ్కో సంస్థ ఉచితంగా ఉపకరణాలను అందజేయనుందని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఏడీ పి.నారాయణమూర్తి తెలిపారు. శిబిరాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు సందర్శించారు.

నేడు జగ్గంపేటలో...

జగ్గంపేట, ఆగస్టు 2: కలెక్టర్ ఆదేశాలతో ఐఎల్ఐఎంసీవో సంస్థ సహకారంతో విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరం శనివారం ఉదయం 9గంటలకు జగ్గంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద శిబిరం నిర్వహిస్తామని టీడీపీ జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర ఓ ప్రకటనలో తెలిపారు. 3 చక్రాల సైకిల్, వీల్‌చైర్స్, చంక కర్రలు, కృత్రిమ కాళ్ళు, కాలిపర్స్, రోలేటర్స్, చెవిమిషన్లు, వాకింగ్ స్టిక్స్ లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్స్, సీపీ చైర్ బ్యాటరీ ఆపరేటర్ వంటి ఉపకరణాలకు గుర్తింపు నమోదు జరుగుతుందని చెప్పారు. సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, యుడీఐ కార్డులతో హాజరుకావాలని కోరారు.

'కలుషిత నీటిని సరఫరా చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోండి'

కాకినాడరూరల్, ఆగస్టు 2: తూరంగి ప్రజలను త్రాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వం కూడా గ్రామంలోని ఈ సమస్యను పట్టించుకోలేదు నీటి సమస్యను తమ ఇబ్బందులను రాష్ట్ర పంచాయితీ రాజ్ డైరెక్టర్ కృష్ణతేజను కలిసి వివరించగా శుక్రవారం డీపీవో భారతిసౌమ్య తూరంగి వచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చింతపల్లి అజయ్ కుమార్, జోగా అప్పారావు, టి.స్వామినాయకర్, స్థానిక మహిళలు సమస్యలను డీపీవోకు వివరిస్తూ ప్రజలు ప్రాణాలు పోయే విధంగా రోగాలు వచ్చే కలుషితమైన నీటిని నిర్లక్ష్యంగా సరఫరా చేస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుల్లబ్బాయిరెడ్డి నగర్ లోని చెరువుకు రిపేర్లు చేయించాలని, పైపులలీకులు సరి చేయాలని, నాయకర్‌రోడ్డును బాగుచేయాలని, డ్రైనేజీల లోని పూడికలు తీయించాలని తెలిపారు. డీపీవో మాట్లాడుతూ వారంరోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్బారావు, నాగబాబు, గోవిందరాజులు, జయప్రకాష్, దుర్గ, అప్పలరాజు, లక్ష్మి, విజయ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

సామర్లకోట, ఆగస్టు 2: పట్టణంలో మున్సిపాల్టీ కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైందని అధికారులు శ్రద్ధ కనబర్చడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని సత్యనారాయణపురం, వీర్రాజునగర్, ప్రకాష్ నగర్, కొత్తూరు, రైల్వే కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల ఎదుర్కొన్నారు. మరికొన్ని వార్డుల్లో బురదతో కూడిన తాగునీరు సరఫరా అయ్యింది. పైప్‌లైన్‌కు పలు ప్రాంతాల్లో లీకులు నిరోధించకపోవడంతో తరచూ మురుగు, బురదనీరు చేరి కుళాయిలద్వారా బురదనీరు సరఫరా వస్తుందని పలువురు ఆరోపించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా

తుని ఎమ్మెల్యే యనమల దివ్య


తునిరూరల్: కేవో మల్లవరంలో విద్యార్థికి కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తునిరూరల్, ఆగస్టు 2: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకాన్ని తునిలో ప్రారంభించారు. మండలంలో రాపాక, దొండవాడ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్‌లతో కిట్టను ఆమె పంపిణీ చేశారు. కేవో మల్లవరంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిటికెల శ్రీనివాసరావు, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజులు మాట్లాడారు. తునిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి శోభారాణి, సిద్దాంతపు సత్తిబాబు, మళ్ళ గణేష్, జల్లువాసు, శ్రీనివాసరాజు, నార్ల రత్నాజీ, బాలాజీ ఉన్నారు.

మొక్కు చెల్లించిన దివ్య

తొండంగి, ఆగస్టు 2: ఎమ్మెల్యే యనమల దివ్య బెండపూడి శివాలయం, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. దివ్య ఎన్నికల్లో విజయం సాధించేందుకు రాష్ట్ర ఎంపీటీసీ సమాఖ్య మాజీ ఉపాధ్యక్షురాలు కొంగర విశాలాక్షి దివ్యతో మొక్కు చెల్లింపు చేస్తానంటూ మొక్కుకున్నారు. శుక్రవారం మాస శివరాత్రి కావడంతో స్థానిక విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి 108 కొబ్బరి కాయలు కొట్టి దివ్య గోపీనాథ్ దంపతులు మొక్కు చెల్లించుకున్నారు. సాయిబాబా ఆలయంలో 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట యనమల సతీమణి విజయలక్ష్మీ, యనమల రాజేష్, కొయ్యా రామకేశవ ఉన్నారు. తొండంగి, దానవాయిపేట ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను ఎమ్మెల్యే యనమల దివ్య పంపిణీ చేశారు. టీడీపీ నేతలు యనమల రాజేష్ సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు కోడ వెంకటరమణ, కొయ్యా రామకేశవ, సర్పంచ్ సోమాల ప్రసాద్, దూలం వీరబాబు,మురళి, బంటుపల్లి అన్వేష్, నేమాల కృష్ణ, పిర్ల శివ, ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

పొలాలకు సాగునీరందించేందుకు చర్యలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 2: నియోజకవర్గంలో పరిధిలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ఈ.గోకవరం గ్రామం వద్ద గల మధ్యతరహా సాగునీటి జలాశయం, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టు పొలాలకు శుక్రవారం కుడి కాలువ షెట్టర్ తీసి నీటిని విడుదల చేశారు. సాగర్‌జలాలకు తొలుత ఆమె హారతులు ఇచ్చి పూజలు చేశారు. సత్యప్రభ మాట్లాడుతూ సుబ్బారెడ్డి సాగర్‌పరిధిలో ఉన్న 10వేల ఎకరాల పంట పొలాలకు ఖరీఫ్ వ్యవసాయ సాగు నిమిత్తం ఈ జలాలు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ జలాలతో వేముల పాలెం, రౌతులపాలెం, పెద్దిపాలెం, పాండవుల పాలెం, ఏలూరు, ఒమ్మంగి, పొదురుపాక, ఉత్తర కంచి, లంపకలోవ, పెదశంకర్లపూడి తదితర గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, వనపర్తి నాగేశ్వరరావు, గొంతిన సురేష్, రాంశెట్టి దివానం, వరుపుల రామకృష్ణ, లొండా లోవరాజు, సత్యంశెట్టి సీతబాబు, ఇళ్ళ అప్పారావు, జువ్విన తిరుపతిరావు, సూర్నీడి బుల్లబ్బాయి, దళే నవీన్, రీసు సత్తిబాబు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం


కాకినాడలో ప్రధాని మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నేతలు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణ అమలుపై మాదిగల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఏడిద కృష్ణ అన్నారు. రేచర్లపేట 6వ డివిజన్ గంటా వారి స్ట్రీట్ డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మార్పీఎస్ జాతీయాధ్యక్షుడు పోరాట ఉద్యమ నాయకుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని మోదీ చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మాదిగలు 30ఏళ్ల చిరకాల వాంఛన నెరవేర్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వల్లూరి సత్తిబాబు, బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి యెనిమిరెడ్డి మాలకొండయ్య రాష్ట్ర ఎలక్షన్ కమిటీ మెంబర్ పైడా వెంకటనారాయణ, ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి కొక్కిలిగడ్డ గంగరాజు, సిటీ కోకన్వీనర్ కొండేటి గంగాధర్, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షులు మేడ విజయలక్ష్మి, సెక్రటరీ నేదూరి జయలక్ష్మి ఉన్నారు.

ప్రత్తిపాడు: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై కూటమి నాయకులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఒమ్మంగి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు కందా వీరస్వామి మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన మోదీ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని సుప్రీంకోర్టుకు అఫడవిట్ దాఖలు చేశారని దానికి అనుకూలంగా సుప్రీం కోర్టు ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పుఇచ్చిందని తెలిపారు. కూటమి నాయకులు సత్యంశెట్టి సీతబాబు, కొప్పన సోమరాజు, కొప్పన రాజబాబు, సుంకర సోమరాజు, ఇంటి వీర నాగేశ్వరరావు ఉన్నారు.

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో 3 దశాబ్దాల పాటు సాగించిన పోరాటం నేటికి ఫలించిందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వర్మను కలిసి వర్గీకరణకు టీడీపీ అందించిన సహకారానికి గానూ కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని, ఇది రెల్లి జాతి మనుగడ మార్పునకు తద్వారా అభివృద్ధికి దోహదం చేస్తుందని ప్రముఖ న్యాయవాది బంగారు రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు బంగారు ద్వారక, యర్రంశెట్టి నాగమణి అన్నారు. రెల్లి జాతి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు పథకాలు రూపొందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

సుప్రీం తీర్పుపై నిరసన

తాళ్లరేవు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి దున్నా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం వద్ద మాలలు నిరసన తెలియజేశారు. డిప్యూటీ తహశీల్దార్ ఎమ్.సూరిబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దళిత సీనియర్ నేత కాశి లక్ష్మణస్వామి నేతలు జక్కల ప్రసాద్‌బాబు, నల్లి బాలకృష్ణ, వడ్డి ఏడుకొండలు, దడాల బుజ్జిబాబు, నల్లి శ్రీనివాస్, పెయ్యల శ్రీనివాస్, మేడపాటి దేవానందం, గంటా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పీవీరావు మాలమహానాడు ఆధ్వర్యంలో పట్టణంలోని రథాలపేట అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీవైఈవో

కొత్తపల్లి, ఆగస్టు 2: విద్యలో బాగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కాకినాడ జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. కొండెవరం వెంగళినాగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవోలు బుర్రా వేణుగోపాల్, పైడిరాజు, ప్రధానోపాధ్యాయులు బత్తిన చక్రపాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు వనపర్తి సూర్యనారాయణ, పలువురు సబ్జెక్టు ఉపాధ్యాయులన్నారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, ఆగస్టు 2: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ శుక్రవారం రెండో రోజు మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ ఆదేశాల మేరకు నెలలో 2రోజులు ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు, వినతుల స్వీకరించే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందన్నారు. కాకినాడ రూరల్ వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు సందీప్ నిర్వహించారు. పలు సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలు, వినతులను స్వీకరించారు.

ఘనంగా చండీహోమం

అన్నవరం, ఆగస్టు 2: రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ రోహిత్ సూపరెంటెండెంట్లు ఐవీ రామారావు, కంచి మూర్తి, స్వామీజీ తదితరులున్నారు.

120 మీటర్ల క్లాత్ వితరణ



జీజీహెచ్ (కాకినాడ), ఆగస్టు 2: రాజమహేంద్రవరానికి చెందిన బోయుడు ఉమ్మాన రాజు నాయుడు శుక్రవారం కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి 120 మీటర్లు క్లాత్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ శస్త్రచికిత్సలు నిర్వహిం చే సమయంలో వైద్యులు వినియోగించే క్లాత్‌ను అందించిన ఉమ్మానను అభినందించారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్, వైద్యులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కరప, ఆగస్టు 2: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్లస్ టు విద్యార్థినులకు సానా సతీష్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ తలాటం హరీష్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్ అందజేశారు. హరీష్‌ను సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, హెచ్ఎం ఎం.శ్రీనివాస్, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, జనసేన, టీడీపీ నాయకులు బందారు మురళి, దేవు వెంకన్న, బోగిరెడ్డి కొండబాబు, కూనపురెడ్డి వీర్రాజు, తణుకులరాజు ఉన్నారు.

మార్చింగ్ బ్యాండ్ బహూకరణ

కరప, ఆగస్టు 2: గురజనాపల్లి హైస్కూల్‌లో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు టి.వేణుగోపాల్ రూ.4వేలు విలువ చేసే మార్చింగ్ బ్యాండ్‌ను పాఠశాలకు బహూకరించారు. హెచ్ఎం ఎ.సాయిమోహన్‌కు అందజేసి పాఠశాలలో అన్ని వేడుకలకు వినియోగించాలని సూచించారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ ఎస్.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద

కిర్లంపూడి, ఆగస్టు 2: మండలంలోని జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఉందని ప్రజలు వాపోతున్నారు. కుక్కలు గుంపులు, గుంపులుగా సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనసేన ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

రౌతులపూడి, ఆగస్టు 2: గిడజాం గ్రామంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వంపై మండల కార్యదర్శి సామిరెడ్డి కుశరాజు ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా గుర్తుతెలియని వ్యక్తులు చించేశారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శాకంబరిగా కనకదుర్గ

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 2: సినిమారోడ్ సంతచెరువు వద్దగల దేవాలయంలో కనకదుర్గ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నగర అధ్యక్షుడు తోట సుధీర్, కూటమి పార్టీల నాయకులు సంగిశెట్టి అశోక్, రెడ్డం సత్తిబాబు, అమలకంటి బలరామ్, చెక్కా రమేష్, నల్లూరి శ్రీనివాస్, సుంకర సురేష్, దొడ్డి వీరేంద్ర, పినిశెట్టి శ్రీనివాసరావు, పొంగా బుజ్జి, సిరియాల రాము పాల్గొన్నారు.